క్లుప్తంగా

బలిజ భవన్ నిర్మాణం కోసం కాపు చైర్మన్‌కు వినతి



కాపు కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని బలిజభవన్ నిర్మాణానికి సహకరించాలని కాపు సంఘ నేతలు కోరారు. వారు సోమవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషును కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చర్చించి నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్, కిరణ్‌బాబు, జొన్న వెంకట్, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

18న కల్యాణ వెంకన్న పుష్పయాగం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 18న పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 17వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మార్చి 18న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం చేపడతారు. 18న నిత్య కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

ఆలయ నిర్మాణానికి రూ.6.66 లక్షల విరాళం



దాతలను సత్కరిస్తున్న యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి సోమవారం నరసింగాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి తనయుడు ప్రీతమ్ రెడ్డి రూ.1,75,776, దివంగత విశ్వనాథ రెడ్డి కుమారుడు సాయిశ్రావణ్ రెడ్డి రూ.50,116, దుర్గం కమలాకర్ రూ.51,116 విరాళం ఇచ్చారు. అదే విధంగా గ్రామస్తులు తమ వంతుగా రూ.3,89,390 సమకూర్చారు. ఈ మొత్తాన్ని నరసింగాపురం గ్రామం తరపున ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి సోమవారం అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ సెక్రటరీగా సంజీవ్‌కుమార్



తిరుపతి లీగల్ : రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జోనల్ సెక్రటరీగా తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉద్యోగి సీహెచ్ వెంకటసంజీవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజుల క్రితం రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రామరాజ చంద్రశేఖర్, ముఖ్య సలహాదారు ఎస్.మస్తాన్‌వలి, కోశాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా ఎస్.ప్రసాద్, అదనపు కార్యదర్శిగా రెడ్డికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటసంజీవ్‌కుమార్ ఎన్నికపై తిరుపతిలోని కోర్టుల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

చురుగ్గా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రాజశేఖర్ రెడ్డి

చంద్రగిరి: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో ఆదెం రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవా రం ఈఓపీఆర్డీ శశిరేఖతో కలిసి నరసింగాపురంలో జరుగుతున్న ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామ కంఠం మ్యాపును పరిశీలించారు. సర్పంచ్ వెంకటరత్నం, ఈఓ నరసింహులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



తిరుపతి: సత్యనారాయణపురం జెడ్పీ హైస్కూల్‌లో ఓటర్ల క్యూ



చంద్రగిరి: క్యూలో ఉన్న ఓటర్లు

తిరుపతి డివిజన్‌లోని ఓటర్లు

పురుషులు	22,394 మంది
మహిళలు	15,501 మంది
ఇతరులు	4
మొత్తం	37,899 మంది
ఓట్లు వేసిన వారు	25,416 మంది
పురుషులు	15,523 మంది
మహిళలు	9,938 మంది
పోలైన ఓట్లు	67.2 శాతం

- కవ్వింపు చర్యలకు దిగిన టీడీపీ నేతలు
- మీడియాలో కనిపించేందుకు హడావుడి
- పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడేందుకు ప్రయత్నం
- కట్టుదిట్టమైన భద్రత కల్పించిన పోలీసులు

తిరుపతి తుడా: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. తిరుపతిలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తిరుపతిలో 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిరుపతి డివిజన్‌లోని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో పురుషులు 22,394 మంది, మహిళలు 15,501 మంది, ఇతరులు నలుగురు, మొత్తం 37,899 మంది ఓటర్లు ఉండగా 25,416 మంది ఓట్లు వేశారు. వారిలో పురుషులు 15,523 మంది, మహిళలు 9,938 మంది ఉన్నారు. 67.2 శాతం ఓట్లు పోలయ్యాయి.

కవ్వింపు చర్యలకు దిగిన టీడీపీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు పలు ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు దిగారు. బాలాజీ కాలనీ సమీపంలోని మాల్వాజీ స్కూల్, సత్యనారాయణపురం పాఠశాల, సంజయ్‌గాంధీ కాలనీ, గోవిందరాజస్వామి పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేతలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారు. గుంపులుగా ఏర్పడి పోలింగ్ స్టేషన్‌లోకి చొరబడేందుకు యత్నించారు. మీడియాలో కనిపించేందుకు హడావుడి చేశారు. కెమెరాలను చూడగానే ముందుకు దూసుకు వచ్చి నినాదాలు చేశారు.



ఓటు వేసినట్టు చూపిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష దంపతులు

పలువురు నేతల అరెస్టు

పోలింగ్‌కు అంతరాయం కలిగించే వారిని పోలీసులు అక్కడిక్కడే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కొర్లగుంట సంజయ్ గాంధీ కాలనీలో టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాస్ అతని అనుచరులు, టౌన్ బ్యాంకు చైర్మన్ జయచంద్రారెడ్డి, అతని అనుచరులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అలానే శ్రీగోవిందరాజ స్వామి పాఠశాల వద్ద హంగామా చేస్తున్న టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌ను అరెస్టు చేశారు. సత్యనారాయణపురంలోనూ ఇరు పార్టీ నేతలను అరెస్టు చేశారు. టీడీపీ నాయకులతో కలిసి బీజేపీ, సీపీఎం నాయకులు నిరసనలు తెలిపారు.



ఓటు వేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

చంద్రగిరిలో..

చంద్రగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. మండలంలో 2,212 మంది పట్టభద్రులకు గాను 1,678 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.84 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే 175 మంది ఉపాధ్యాయులకు గాను 154 మంది ఓటు ఓటు వేశారు. 84 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు ఉదయం 8 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సీఐ ఓబులేశు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని ఎన్నికల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. దొంగ ఓట్లు వేయకుండా చూశారు.



ఓటు వేస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ఓట్లు వేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ మోహిత్‌రెడ్డి

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటును వినియోగించుకున్నారు. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డితో కలిసి అక్కడికి చేరుకున్నారు. అదే విధంగా తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఓటు వేశారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 1,273 మంది పట్టభద్రుల్లో 1,009 మంది, 27 మంది ఉపాధ్యాయుల్లో 26 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రం వద్ద సీఐ రవీంద్రనాథ్, ఎస్ఐ గిరిబాబు, 25 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పాకాలలో..

పాకాల : స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పట్టభద్రులు 73.45 శాతం, ఉపాధ్యాయులు 87 శాతం ఓట్లు నమోదయ్యాయి. తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో పట్టభద్రుల ఓటర్లు 2,034 ఉండగా 1,494 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 77 ఉండగా 67 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. దొంగ ఓట్లు వేస్తున్నారని టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతోపాటు ఒకరికొకరు తోపులాటకు దిగారు. వారిని పోలీసులు చెదరగొట్టారు. టీడీపీ శ్రేణులు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడంతో పోలీసులు బయకు పంపించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్నికల అధికారి అనుపమ అంజలి పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో బ్యాలెట్ బాక్స్‌లు, ఓటింగ్ సరళిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆమె వెంట అదనపు కమిషనర్ సునీత, ఇతర ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ బూత్‌లో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



రామచంద్రాపురంలో పోలీసుల బందోబస్తు



ఓటు వేసినట్టు చూపుతున్న పట్టభద్రులు



డాక్టర్ రమణయ్య దంపతులు



బ్యాలెట్ బాక్సుల తరలింపు

వేడుకగా సీతారామాంజనేయ ఆలయ కుంభాభిషేకం



విష్వక్సేన ఆరాధన చేస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని ఉపాధ్యాయనగర్‌లో నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం నుంచి 17వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పైడా శ్రీనివాసులురెడ్డి, తోట నరసింహులు నాయుడు మాట్లాడుతూ భక్తి ముక్తికి, జీవన సాఫల్యానికి దోహదపడుతున్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రజల్లో భక్తి తత్వాన్ని పెంపొందించాలనే సంకల్పంతో సీతారామంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఐదు రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విశేష హోమాలు, పూజలు నిర్వహిస్తామని, 17న స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం వేడుకగా నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



మొల్ల విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కవియిత్రి మొల్లమాంబ సాహితీ పీఠం చైర్మన్, బీసీ నేతలు



మొల్లకు నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: కవియిత్రి మొల్లమాంబ జయంతిని సోమవారం సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహతి కళాక్షేత్రం వద్దనున్న సర్కిల్‌లోని మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కవియిత్రి మొల్లమాంబ సాహితీ పీఠం చైర్మన్ బీవీ.కేశవులు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ జమున, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, ఆర్‌జేయూపీ అధ్యక్షుడు టి.గోపాల్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, అధికార భాషా సంఘం సభ్యురాలు డి.మస్తానమ్మ, రజక సంఘం నేత అక్కినపల్లి లక్ష్మయ్య, శాలివాహన యువజన నేత వెంకటేష్, ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం హెడ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మొల్ల జయంతిని నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, సుబ్రమణ్యంరెడ్డి, మునిక్రిష్ణయ్య యాదవ్, పొన్నాల జేజిరెడ్డి, ఆముదాల నారాయణ, కె.కేశవులురెడ్డి పాల్గొన్నారు.

విశేష పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో మృత్యుంజయస్వామిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పెయింటింగ్ ఆర్టిస్ట్ నూతన కమిటీ ఎంపిక



తిరుపతి పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు, నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కేవీ.మోహన్ ఎంపికయ్యారు. బాబూ జగ్జీవన్ భవన్‌లో సోమవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ సుకుమార్ హాజరై అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడుగా వైఎస్.గోపీనాథ్, సలహాదారులుగా కె.సుధాకర్, రాజేంద్ర, ఉపాధ్యక్షుడిగా టి.జ్ఞానసుందర్, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా మురుగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉత్తరప్రదేశ్ కార్మికుల సమస్యలు



మాట్లాడుతున్న రాజారెడ్డి, ఉపేంద్రరెడ్డి

- వైఎస్సార్‌టీయూసీ నాయకులు రాజారెడ్డి, ఉపేంద్రరెడ్డి

తిరుపతి రూరల్: ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి తెలిపారు. వారు సోమవారం మల్లంగుంటలో తిరుపతి అర్బన్, రూరల్ మండలాల్లో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులకు గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందలేదని తెలిపారు. అనుకోని ప్రమాదం జరిగితే బీమాను సైతం పొందలేక పోతున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు కార్మికుల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 10 ఏళ్లకు పైగా ఇక్కడే నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వ సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రఫీ, రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, వలస కార్మికుల ప్రతినిధులు శంభుయాదవ్, నాగేంద్రసింగ్, రాజేష్, బీజర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 43 మందికి రూ.86 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరి తెలిపారు. నిందితులను తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే



ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది

నారాయణవనం: అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డేను సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌ను శాలువ కప్పి, పూలమాలలు వేసి తోటిసిబ్బంది సన్మానించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ రోగ నిర్ధారణ అయితే గానీ మెరుగైన వైద్యాన్ని అందించలేమని, ల్యాబ్ టెక్నీషియన్ల నైపుణ్యత, నిబద్ధతపైనే రోగ నిర్ధారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాగసుధ, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ బాబు, స్టాఫ్‌నర్సులు సుభాషిణి, దేవీభారతి, అరుణ, వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.